# ఇండియన్ పాలిటీ

## స్థానిక స్వపరిపాలన - కమిటీలు - సిఫారసులు

పాలిటీలోని 73, 74వ రాజ్యాంగ సవరణల గురించి అధ్యయనం చేసేటప్పుడు ముందుగా ఇందుకోసం వేసిన కమిటీలు, సిఫారసులపై అవగాహన పెంచుకోవాలి. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి సమాజ వికాస కార్యక్రమంతో ప్రారంభించి తదనంతరం ఏర్పాటైన కమిటీలు, వాటి కాలాలు, అవి చేసిన వివిధ రికమండేషన్లపై పరీక్షల్లో ప్రశ్నలు వస్తాయి.

**అశోక్ మెహతా కమిటీ (1977)**

1977, డిసెంబరు 12న జనతా ప్రభుత్వం మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్న కాలంలో బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించిన మూడంచెల పంచాయతీ వ్యవస్థను సమీక్షించి తగిన సిఫారసులు చేయమని 'అశోక్ మెహతా' అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ (కేరళ), ఎం.జి. రామచంద్రన్ (తమిళనాడు) ఈ కమిటీలోని సభ్యులు.

- అశోక్ మెహతా కమిటీ 1978, ఆగస్టు 21న 132 సిఫారసులతో ఒక నివేదికను సమర్పించింది.

**ముఖ్యాంశాలు:**

రెండంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అంటే

1) పై స్థాయిలో – జిల్లా పరిషత్

2) కింది స్థాయిలో – మండల పరిషత్

- గ్రామ పంచాయతీలను రద్దు చేసి వాటి స్థానంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించింది.
- రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలను రద్దు చేయకూడదు. ఒకవేళ అనివార్య పరిస్థితుల్లో రద్దు చేస్తే ఆరు నెలల్లోపు ఎన్నికలను నిర్వహించాలి. వీటిని పర్యవేక్షించడానికి ఒక పంచాయతీరాజ్ శాఖ మంత్రిని నియమించాలి.
- 15,000 – 20,000 జనాభాకు ఒక మండల పంచాయతీని ఏర్పాటు చేయాలి.
- గ్రామసభకు ప్రాముఖ్యం ఇవ్వాలి.
- పంచాయతీ వ్యవస్థల పదవీ కాలం నాలుగు సంవత్సరాలు.
- స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పాల్గొనాలి.
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పంచాయతీరాజ్ వ్యవస్థలకు ఎన్నికలను నిర్వహించాలి.
- పంచాయతీరాజ్ సంస్థలకు సొంతంగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి పన్నులు వసూలు చేసే అధికారాన్ని కల్పించాలి.
- జిల్లా పరిషత్‌ను కార్యనిర్వాహక వ్యవస్థగా రూపొందించి, దానికి ప్రణాళికను తయారు చేసే అధికారాన్ని కల్పించాలి. ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను ఏర్పాటు చేయాలి.
- ఈ కమిటీ సిఫారసులను కేంద్రం పూర్తిస్థాయిలో అమలుచేసినప్పటికీ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ్ బంగా రాష్ట్రాలు కొన్ని మార్పులతో అమలుచేశాయి.
- ఈ కమిటీ సూచించిన మండల వ్యవస్థను మొదట కర్ణాటకలో 1985, అక్టోబరు 2న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే అమలుచేశారు.
- మండల వ్యవస్థను అమలుచేసిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. దీన్ని 1986, జనవరి 13న ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించారు.
- బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచనల ప్రకారం ఏర్పాటైన పంచాయతీ వ్యవస్థలను 'మొదటి తరం' పంచాయతీలు అంటారు.
- అశోక్ మెహతా కమిటీ సిఫారసుల ఆధారంగా (ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ్ బంగా) ఏర్పాటైన పంచాయతీ వ్యవస్థలను 'రెండోతరం' పంచాయతీలని పేర్కొంటారు.

## పి.కె. తుంగన్ కేబినెట్ సబ్ కమిటీ (1988)

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు సంబంధించిన పార్లమెంట్ సంప్రదింపుల కమిటీకి చెందిన ఉప కమిటీ ఛైర్మన్ అయిన పి. కె. తుంగన్ అధ్యక్షతన దీన్ని 1988లో ఏర్పాటుచేశారు.

**సిఫారసులు:**

- స్థానిక సంస్థలకు రాజ్యాంగ బద్ధత కల్పించాలి.
- జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ప్రణాళికను అభివృద్ధి ఏజెన్సీగా పరిగణించాలి.
- రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఎల్.ఎమ్. సింఘ్వీ కమిటీ, తుంగన్ కమిటీ సూచనల ఆధారంగా 64, 65వ రాజ్యాంగ సవరణ బిల్లుల్ని రూపొందించింది.
- 64వ సవరణ బిల్లు పంచాయతీరాజ్ సంస్థలకు, 65వ సవరణ బిల్లు పట్టణ, నగర పాలక సంస్థలకు సంబంధించింది. కానీ ఇవి అమలుకాలేదు.

## జి.వి.కె. రావు కమిటీ (1985)

ప్రణాళికా సంఘం 1985లో 'గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన – పరిపాలన ఏర్పాట్లు' అనే అంశాన్ని పరిశీలించడానికి జి. వి. కె. రావు అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటుచేసింది.

**సిఫారసులు:**

- ప్రణాళికాభివృద్ధికి జిల్లాను యూనిట్‌గా తీసుకోవాలి.
- బ్లాక్ వ్యవస్థను రద్దు చేయాలి.
- జిల్లా పరిషత్‌లను పటిష్ఠపరచాలి.
- నైష్పత్తిక ప్రాతినిధ్యంతో కూడిన ఉప కమిటీలను జిల్లా స్థాయిలో ఏర్పాటుచేయాలి.
- జిల్లా యూనిట్‌లకు ప్రణాళికా విధులను బదలాయించాలి.
- పంచాయతీరాజ్ సంస్థలకు క్రమం తప్పకుండా ఎన్నికలను నిర్వహించాలి.
- జిల్లా అభివృద్ధి అధికారి పేరుతో ఒక పదవిని ఏర్పాటు చేసి, జిల్లా పరిషత్‌కు సంబంధించిన అతి ముఖ్య కార్యనిర్వాహక బాధ్యతలను అతడికి అప్పగించాలి.
- జిల్లా పరిషత్‌కు కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించాలి.

## ఆర్.ఎస్. సర్కారియా కమిషన్ (1988)

- క్రమం తప్పకుండా ఎన్నికలను నిర్వహించాలి.
- స్థానిక సంస్థలను రద్దు చేయడానికి సంబంధించి అన్ని రాష్ట్రాల్లో ఒకేరకమైన చట్టాన్ని అమలుచేయాలి.
- పంచాయతీరాజ్ అధికారాలను రాష్ట్రాలకు అప్పగించాలి.
- స్థానిక సంస్థలను ఆర్థికంగా, విధుల పరంగా పటిష్ఠ పరచాలి.
- ఈ కమిషన్ దేశానికంతటికీ అవసరమయ్యే పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించాలని పేర్కొంది.

## దంత్‌వాలా కమిటీ (1978)

బ్లాక్ స్థాయిలో ప్రణాళికీకరణపై అధ్యయనం చేయడానికి 'దంత్‌వాలా' కమిటీని ఏర్పాటుచేశారు.

**సిఫారసులు:**

- గ్రామ పంచాయతీ సర్పంచ్‌లను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవాలి.

- మధ్యస్థ వ్యవస్థకు (బ్లాక్ స్థాయి) ప్రాధాన్యం ఇవ్వాలి.
- జిల్లా ప్రణాళికలో కలెక్టర్ ప్రధానపాత్ర పోషించాలి.
- బ్లాక్‌ను ఒక యూనిట్‌గా తీసుకుని ప్రణాళికలను రూపొందించాలి.

### సి.హెచ్. హనుమంతరావు కమిటీ (1984)

- జిల్లా స్థాయి ప్రణాళికీకరణపై ఈ కమిటీని ఏర్పాటు చేశారు.
- జిల్లా ప్రణాళికా సంఘాన్ని కలెక్టర్ లేదా మంత్రి అధ్యక్షతన ఏర్పాటుచేయాలి. దీనికి కలెక్టర్ సమన్వయ కర్తగా ఉండాలి.
- బ్లాక్ అభివృద్ధి అధికారి పోస్టును రద్దు చేయాలి.

### ఎల్.ఎమ్. సింఘ్వీ కమిటీ (1986)

1986లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో పంచాయతీలను బలోపేతం చేసి, అవసరమైన సిఫారసులు చేయడానికి ఎల్.ఎమ్. సింఘ్వీ అధ్యక్షతన ఒక కమిటీని నియమించారు.

**సిఫారసులు:**

- స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి, వాటిని పరిరక్షించాలి.
- గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులను అందించాలి.
- కొన్ని గ్రామ సముదాయాలకు న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి.
- గ్రామ పంచాయతీలు సక్రమంగా పనిచేయాలంటే గ్రామాలను పునర్వ్యవస్థీకరించాలి.
- ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికైన గ్రామసభను ఏర్పాటు చేయాలి.
- క్రమం తప్పకుండా ఎన్నికలను నిర్వహించాలి.
- పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేక 'జ్యుడీషియల్ ట్రైబ్యునల్'ను ఏర్పాటు చేయాలి.

### గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

**1.** 'గ్రామ స్వరాజ్' అనే భావనను రూపకల్పన చేసినవారు? **(పంచాయతీ సెక్రటరీ, 2016)**

1) జయప్రకాశ్ నారాయణ్ 2) ఆచార్య వినోబాభావే
3) మహాత్మా గాంధీ 4) స్వామి దయానంద

**2.** స్థానిక స్వపరిపాలన సంస్థలకు ఎన్నికలను నిర్వహించేది? **(పంచాయతీ సెక్రటరీ, 2012)**

1) భారత ఎన్నికల సంఘం 2) రాష్ట్ర ఎన్నికల కమిషన్
3) జిల్లా కలెక్టర్ 4) పంచాయతీరాజ్ శాఖ

**3.** అశోక్ మెహతా కమిటీ దేనికి సంబంధించింది? **(ఆర్కియాలజీ, మ్యూజియమ్స్ - 2012)**

1) పంచాయతీరాజ్ సంస్కరణలు 2) ఆర్థిక సంస్కరణలు
3) విద్యా సంస్కరణలు 4) పారిశ్రామిక సంస్కరణలు

**4.** జి.వి.కె. రావు కమిటీ దేనికి సంబంధించింది? **(ఏసీఎఫ్, 2012)**

1) గ్రామీణాభివృద్ధి, గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం
2) మున్సిపల్ ఆర్థిక వ్యవహారాలు
3) పంచాయతీరాజ్ సంస్కరణలు
4) కార్పొరేట్ ఆర్థిక వ్యవహారాలు

**5.** కిందివాటిలో పంచాయతీరాజ్‌తో సంబంధం ఉన్న కమిటీ? **(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, 2012)**

1) ఎల్.ఎమ్. సింఘ్వీ కమిటీ
2) జి.వి.కె. రావు కమిటీ
3) బల్వంతరాయ్ మెహతా కమిటీ
4) అన్నీ

**6.** కిందివాటిలో బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫారసులకు సంబంధించింది? **(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, 2012)**

1) బ్లాక్ విధాన ఏర్పాటు
2) గ్రామ పంచాయతీల ఏర్పాటు
3) జిల్లా స్థాయిలో ప్రజాస్వామిక వికేంద్రీకరణ
4) జిల్లా కలెక్టర్లకు ఎక్కువ అధికారాలు

**7.** కిందివాటిలో పంచాయతీరాజ్‌తో సంబంధం ఉన్న కమిటీ? **(సివిల్ సర్జన్, 2012)**

1) అశోక్ మెహతా కమిటీ
2) ఎల్.ఎమ్. సింఘ్వీ కమిటీ
3) కె. సంతానం కమిటీ
4) అన్నీ

**8.** కిందివాటిలో పంచాయతీరాజ్ వ్యవస్థపై ఏర్పాటు చేసిన కమిటీ?

1) అబిద్ హుస్సేన్ కమిటీ
2) ఖుస్రో కమిటీ
3) అశోక్ మెహతా కమిటీ
4) చక్రవర్తి కమిటీ

**9.** 1979లో అశోక్ మెహతా కమిటీ వేటిని సమీక్షించింది? **(గ్రూప్ I, 1991)**

1) కేంద్ర, రాష్ట్ర సంబంధాలు
2) పంచాయతీరాజ్ సంస్థలు
3) గవర్నర్ల పాత్ర
4) ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు

**10.** ప్రస్తుత పంచాయతీరాజ్ వ్యవస్థకు మూలం? **(గ్రూప్ I, 1999)**

1) అశోక్ మెహతా కమిటీ
2) బల్వంతరాయ్ మెహతా కమిటీ
3) వసంత్‌రావ్ నాయక్ కమిటీ
4) రాజమన్నార్ కమిటీ

**సమాధానాలు**

1-3; 2-2; 3-1; 4-1; 5-4; 6-2; 7-4; 8-3; 9-2; 10-2.

**రచయిత: అయితరాజు లక్ష్మణ్**

www.eenadupratibha.net